చెత్త పాలన.. ఏదీ పర్యవేక్షణ?

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని చెబుతున్న పాలకుల హామీలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌లు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శులు ఒకటి, రెండు చోట్ల తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేపట్టి మమ అనిపించుకున్నారు. దీంతో గ్రామాల్లో అపారిశుధ్యం ప్రబలి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

- గ్రామాల్లో క్షీణిస్తున్న పారిశుధ్యం
- ఎక్కడికక్కడే పేరుకుపోతున్న చెత్త నిల్వలు
- ప్రబలుతున్న అంటు వ్యాధులు
- సత్ఫలితాలను ఇవ్వని స్పెషల్ డ్రైవ్‌లు

ఉప్పలగుప్తం: గ్రామీణ ప్రాంతాల్లో మేజర్, మైనర్ పంచాయతీల్లో ఎటు చూసినా ప్రధాన రోడ్లు, పంట కాలువ గట్ల వెంబడి నివాసితులు, దుకాణదారులు చెత్తా చెదారాలను ఇష్టానుసారంగా పడేస్తున్నారు. శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవటంతో గ్రామాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. దీంతో డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మైనర్ పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం దీనికి ప్రధాన కారణం. మేజర్ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ లేకపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అందుబాటులో లేని కార్యదర్శులు

ముమ్మిడివరం, అమలాపురం నియోజక వర్గాల పరిధిలో చాలా పంచాయతీలకు కార్యదర్శులు లేరు. ఉన్న కార్యదర్శులు ఒక్కొక్కరూ నాలుగైదు పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామాలను పరిశుభ్రం చేయాలని సిబ్బందికి సూచించినా వారు పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కార్యదర్శులకు చెబుదామంటే వారు అందుబాటులో ఉండటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం నియోజకవర్గంలో ఉన్న మున్సిపాలిటీతో పాటు అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం మండలాల పరిధిలో 60 పంచాయతీలు ఉన్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల పరిధిలో 63 పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ పంచాయతీ పరిధిలోనూ పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలం కావడంతో ప్రజలు అపారిశుధ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కానరాని డంపింగ్ యార్డులు

ఇక గ్రామాల్లో డంపింగ్ యార్డుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. మేజర్ పంచాయతీలకు సైతం డంపింగ్ యార్డులు లేవు. కొన్ని గ్రామాల్లో చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలను నిర్మించినా అవి ఉన్నతాధికారులు వచ్చినప్పుడే తప్ప మిగతా సమయంలో వాడుకలో ఉండటం లేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చినా అధికారులు కాంట్రాక్టర్‌లకు స్థాయికి మించి పనులు మంజూరు చెయ్యటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. ప్రతి పంచాయతీ పరిధిలో చెత్తను తీసుకునే వచ్చే విధంగా మూడు చక్రాల రిక్షాలను అందించినా అవి గ్రామాల్లో ఏదో‌క మూలకు చేరడంతో తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో రోడ్ల వెంబడి ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారబోస్తున్నారు. ఈ కారణంగా దోమలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో చెత్తను దూర ప్రాంతాలకు తరలించాల్సిన పంచాయతీ సిబ్బంది అనునిత్యం నిప్పు పెట్టి తగలబెడుతున్నారు. దీంతో నివాస ప్రాంతాల్లో పొగ పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, వర్షం వల్ల నిలిచిపోయిన నీటిలో పుడుతున్న దోమలు కుట్టడం వల్ల జనం డెంగీ బారిన పడుతున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఇటీవల విష జ్వరాల కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.


చల్లపల్లిలో ప్రధాన రహదారి వెంబడి వదిలేసిన చెత్త


ఉప్పలగుప్తంలో ప్రధాన సెంటర్లో చెత్తను తగలబెడుతున్న పారిశుధ్య సిబ్బంది

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లో నెలకొన్న అపారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల ప్రక్కన ఎటు చూసినా చెత్తా చెదారంతో అపారిశుధ్యం తాండవిస్తోంది. పంచాయతీ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఏదైనా కార్యక్రమం జరుగుతున్నప్పుడు కార్యదర్శులు మెప్పు కోసం శుభ్రం చేసిన ఫోటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. తప్ప క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామాల్లో ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలి.

– పొలమూరి మోహన్‌బాబు, బీఎస్పీ ఇన్‌చార్జ్, అమలాపురం నియోజకవర్గం.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాళ్లరేవు: కాకినాడ డీఎస్‌ఏ గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు హేండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం ఎన్.రాజ రాజేశ్వరి శనివారం తెలిపారు. అండర్-14 బాల బాలికల పోటీలలో కాశి అచ్యుత రామ్, కాశి సత్య దుర్గా భైరవి, చిట్టిమేను విజయదుర్గ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులతో పాటు వారికి తర్ఫీదు నిచ్చిన పీఈటీ జి.సువర్ణాదేవిని గ్రామ సర్పంచ్ చింతలపాటి అనూష, నాయకులు సాగి బాబ్జీరాజు, శ్రీనురాజు, విద్యా కమిటీ ఛైర్మన్ నాటి సతీష్ అభినందించారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రికెట్ టోర్నీ విజేత బాబి స్టార్స్

యానాం: దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకొని నిర్వహించిన వెయిట్‌లెస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌ను శనివారం నిర్వహించారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో గత కొద్ది రోజులుగా నిర్వహించిన పోటీల్లో యానాం, తాళ్లరేవు తదితర మండలాలకు చెందిన 20 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో విన్నర్స్‌గా బాబిస్టార్, రన్నర్స్‌గా సిల్లీ స్వేచ్చర్స్ నిలిచాయి. ఫైనల్స్‌లో గెలుపొందిన జట్టుకు రూ.6 వేలు, రన్నర్స్‌కు రూ.4 వేలు నగదు బహుమతిని అందజేశారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రతినిధులు

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

అల్లవరం: దేవగుప్తం-గుండెపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవగుప్తం సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాధనాల వెంకటరావు భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. త్వరిత గతిన చేపట్టే మరమ్మతుల నిమిత్తం రూ.40 లక్షలు కేటాయింపులు చేయడం జరిగిందని ఆర్‌అండ్‌బీ ఏఈ అంబేడ్కర్ తెలిపారు.

సేవలకు సత్కారం

అమలాపురం రూరల్: సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఉత్తమ ఉపాధ్యాయుడు బీఎస్‌ఆర్ ప్రసాద్ మాష్టారు అని ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మండలం ఈదరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన మాష్టారి సన్మాన సభ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు పి.చంద్రరావు అధ్యక్షతన అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శనివారం జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే ఆనందరావు, ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రసాద్ విద్యా వ్యవస్థ పట్ల అనుసరించిన విధానాలను ప్రశంసించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వర రావు, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకుల రాజు, ఏంటీవీ సుబ్బారావు, నేరేడుమిల్లి సత్యనారాయణ, ఎంఈఓ కిరణ్ బాబు, గోసంగి బంగార్రాజు, మంగం సుధాకర్, గెద్దం ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఉపాధ్యాయులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సాక్షి ఇంపాక్ట్

యానాం: యానాం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహించే హెచ్‌ఆర్ స్కీమ్ సిబ్బందికి 8 నెలల నుంచి వేతనాలు చెల్లించక పోవడంతో వారు విధులకు హాజరు కావడం లేదు. శనివారం ఉన్నపాటి మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. పలు వీధులు, మెయిన్ రోడ్లు, ఆలయాలు, వ్యాపార సముదాయాల వద్ద పేరుకు పోయిన చెత్త, వ్యర్థాల గురించి సాక్షి పత్రికలో 'క్షీణించిన పారిశుధ్యం–వీధుల్లో దుర్గంధం' శీర్షికన శనివారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గూటం రాంబాబు నేతృత్వంలో సిబ్బంది చెత్త, వ్యర్థాలను పూర్తిగా ఊడ్చి ట్రాక్టర్ సహాయంతో తరలించారు. చిన్నా సెంటర్, విష్ణాలయం వీధి, సుబ్రహ్మణ్య భారతి వీధి, చింతావారి వీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే రాజీవ్‌బీచ్ వద్ద కార్తికమాస పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకండా శనివారం తెల్లవారు జామునుంచే చెత్తను తొలగించి బ్లీచింగ్ చేశారు.


చెత్తను ట్రాక్టర్ సహాయంతో తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

టైలరింగ్ వృత్తిదారుల ఆందోళన

ముమ్మిడివరం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ టైలరింగ్ వృత్తిదారులు శనివారం కోనసీమ జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. శ్రీ బాలయోగి ప్రైమరీ టైలర్స్ కో ఆపరేటివ్ సొసైటీ కళాకారుల సహకార సంఘం జిల్లా కార్యదర్శి దొంగ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. చేనేత కార్మికుల మాదిరిగా తమకు కూడా 50 ఏళ్లకే పింఛన్ సౌకర్యం కల్పించాలని, సొసైటీల ద్వారా టైలరింగ్ మెటీరియల్స్ సబ్సిడీ రేట్లకే అందించాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ చైర్మన్ జక్కంశెట్టి స్వామి, వాకా భాస్కరరావు, పీటీ మూర్తి, లేగ సుబ్రహ్మణ్యం, పోలేటి సుబ్బారావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్ట పరిహారం అందించాలి

యానాం: యానాం నియోజకవర్గ మత్స్యకారులకు ఓఎన్జీసీ సంస్థ అందించాల్సిన నష్ట పరిహారం త్వరిత గతిన అందజేయాలని, సీఎస్ఆర్ నిధులతో చేపట్టే పనులకు నిధులు విడుదల చేయాలని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. శనివారం ఆయన పలు అపరిష్కృత అంశాలపై చర్చించారు. ఎస్సీ సొసైటీ భూముల రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ఈ నెల 21లోగా ఇచ్చేలా చూడాలన్నారు. అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌కు ఇవ్వాల్సిన సీఎస్ఆర్ నిధులతో పాటు డెవలప్‌మెంట్ ఫండ్‌ను సైతం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. 231 మంది మత్స్యకారులకు పరిహారం మంజూరుకు పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి అనుమతి లేఖను అందజేశారు.


ఓఎన్జీసీ ఈడీ రత్నేష్ కుమార్‌తో మల్లాడి భేటీ

గణపతినగర్‌లో కొలువైన శ్రీవిజయ దుర్గ మహోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

కార్తిక మాస పూజలు ప్రారంభం


తాళ్లరేవులో పూజలందుకుంటున్న వీరేశ్వర స్వామి


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: హరిహరులకు ప్రీతికరమైన పవిత్ర కార్తిక మాసం ప్రారంభం సందర్భంగా ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. మండలంలోని ప్రముఖ శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తాళ్లరేవు, సుంకరపాలెం గ్రామాలలో వేంచేసి యున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామి, నీలపల్లి శ్రీ మీనాక్షి సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి, పాతకోరంగి శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వర స్వామి, చొల్లంగిలో చంద్ర ప్రతిష్టిత లింగమైన శ్రీ రాజ రాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి, పిల్లంక, బ్రహ్మపురి గ్రామాల్లో వేంచేసి యున్న శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరీ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

త్రయంబకేశ్వరుని సన్నిధిలో కార్తిక పూజలు

అమలాపురం రూరల్: మండలంలో పాత బండారు లంక గ్రామంలో వేంచేసి యున్న భువనేశ్వరీ సమేత త్రయంభ కేశ్వర స్వామి ఆలయంలో పవిత్ర కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మూల విరాట్ విగ్రహాలకు అలంకరణ చేశారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో ప్రసాదం వితరణ చేశారు. తొలుత వినాయకుడికి అష్ట ద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ పురోహితుడు సద్గురు సత్యనారాయణ వైదికత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ధర్మకర్త పిచ్చిక వెంకన్న, చింతా అత్తి లింగం, గోళ్ల మల్లేశ్వరరావు రావు, లింగామూర్తి, కొండా చంటి పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: పవిత్ర కార్తిక మాసం ఆరంభం రోజైన శనివారం భక్తులు శివాలయాల బాట పట్టారు. అమలాపురం పట్టణంలోని శివాలయాల్లోనే కాక పలు ఆలయాల్లో కార్తిక పూజలు, అభిషేకాలు తెల్లవారు జాము నుంచే మొదలయ్యాయి. పట్టణంలోని పురాతన శివ క్షేత్రం చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, సిద్దేశ్వర స్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయం, నాగ లింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు గణపతి, కనకదుర్గ, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో కార్తిక పూజలు జరిగాయి. శనివారం రాత్రి పలు ఆలయాల వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి ఆ ప్రాంతాన్ని దేదీప్యమానం చేశారు.

మృత్తికా సోదిత మహా లింగార్చన

ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకొని విలసవిల్లి శ్రీరామ మందిరంలో పురోహితులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో శనివారం మృత్తికా సోదిత మహా లింగార్చన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నెల రోజుల పాటు 365 మృత్తికా సోదిత లింగాలకు అర్చనలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించనున్నారని పురోహితులు తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికలు

అమలాపురం రూరల్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో అండర్-14 బాలురు, అండర్ 17 బాల, బాలికలకు క్రికెట్ సెలక్షన్, ట్రయిల్స్ ఎంపిక నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విజయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు క్రికెట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట రవి తెలిపారు. డీఈఓ సలీం బాషా క్రికెట్ సెలక్షన్‌ను సందర్శించి క్రీడాకారులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో పీ.సురేష్ కుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు చొల్లంగి ప్రసాద్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సెక్రటరీ బీవీవీఎస్ఎన్ మూర్తి, ట్రెజరర్ గణపతి రామారావు, హెచ్‌ఎం అసోసియేషన్ సెక్రెటరీ విత్తనాల శ్రీనివాస్, అమలాపురం జోన్ అధ్యక్షుడు వైఎస్.రమణారావు పాల్గొన్నారు. సెలక్టర్లుగా ఆర్.నాగకుమార్, పి శ్రీనివాస్ రెడ్డి, బళ్ల శ్రీను, ధర్మశేఖర్ వ్యవహరించారు.


అండర్-14 బాలికల జట్టుతో డీఈవో సలీం బాషా

వేంకటేశ్వరుడికి మకర తోరణం

కాట్రేనికోన: మండలంలోని బలుసుతిప్ప గ్రామంలో వేంచేసి యున్న వేంకటేశ్వరునికి ఆలయ అర్చకుడు ఎస్‌వి ఫణి కుమార్ ఇత్తడి మకరతోరణం బహూకరించారని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మల్లాడి వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో శాంతి హోమం, స్వామికి అభిషేకాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ


పాఠశాలకు ఇన్వర్టర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అమలాపురం రూరల్: కామన గరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఇన్వర్టర్‌ను బహూకరించారు. 1996–2001 మధ్య కాలంలో పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.26 వేలు విలువైన ఇన్వర్టర్ శనివారం అందించారు. ప్రధానోపాధ్యాయులు వి చక్రధరరావుకు ఇన్వర్టర్‌ను అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం.చక్రధరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నదానానికి విరాళం అందజేత

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన బావిశెట్టి నాగబాబు రూ.10,116లు విరాళంగా సమకూర్చారు. అమలాపురం మాజీ మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల గణేష్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పేరు మీద ఈ వితరణ చేసినట్లు నాగబాబు దేవస్థానం అధికారులకు తెలిపారు. ఆలయ ఉద్యోగి సత్యనారాయణకు విరాళాన్ని అందించారు.

ఓటు నమోదు చేయించుకోండి

తాళ్లరేవు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్ట భద్రులంతా తమ ఓటును నమోదు చేయించు కోవాలని తహసీల్దార్ పితాని త్రినాథరావు, ఎంపీడీఓ కె సత్యన్నారాయణలు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2021 అక్టోబరు 31 నాటికి పట్ట భద్రులైన వారు తమ ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 6 వరకు మాత్రమే గడువు ఉండడంతో ప్రతి ఒక్కరూ విధిగా ఓటు నమోదు చేయించు కోవాలని కోరారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యాశాఖ కార్యాలయాలలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఐ.పోలవరం: యానాం- ఎదుర్లంక వారధిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులకు గాయాలయ్యాయి. యానాం నుంచి ఎదుర్లంక వైపు వస్తున్న మోటారు సైకిల్‌ను, ఎదుర్లంక నుంచి యానాం వైపు వెళుతున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

రూ.3.21 కోట్లతో రోడ్లకు మరమ్మతులు

ఐ.పోలవరం: ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో రోడ్ల మరమ్మతులకు రూ.3.21 కోట్లు ఖర్చు చేయనున్నామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) తెలిపారు. ఈ నిధులతో రోడ్ల మీద గుంతలు లేకుండా చేస్తామని చెప్పారు. ఐ.పోలవరంలో 'గుంతల రహిత ఏపీ' కార్యక్రమానికి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గుంతలు పూడ్చటం, మరమ్మతులు, కంప చెట్ల తొలగింపు, కల్వర్టుల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, చెల్లి అశోక్, కాకర్లపూడి రాజేష్, పిన్నమరాజు శివరాజు, బొంతు సత్య ప్రసాద్, పిల్లా గోపి, దేవు రాంబాబు, మల్లిపూడి రాజా, మద్దిరెడ్డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు పౌరుల భాగస్వామ్యం అవసరం


వాక్‌థాన్‌లో పాల్గొన్న ఉద్యోగులు

యానాం: అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో పౌరులను భాగస్వాములు చేసే విధంగా విజిలెన్స్ శాఖ కార్యక్రమాలను నిర్వహిస్తుందని విశాఖపట్టణం విభాగం సీబీఐ అధికారి మురళి పేర్కొన్నారు. శనివారం ఎస్‌ఎస్‌ఏ కాన్ఫరెన్స్ హాలులో విజిలెన్స్ ఎవేర్‌నెస్ వీక్‌ను పురస్కరించుకొని గత నెల 28 నుంచి నవంబర్ 3 వరకు 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రోస్పరిటీ' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆర్‌ఏఓ మునిస్వామి పాల్గొన్నారు. విజిలెన్స్ ఎవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పట్టణ వీధుల్లో వాక్‌థాన్‌ను ఉద్యోగులు నిర్వహించారు. ఆర్‌ఏఓ ఆఫీసు, విష్ణాలయం వీధి, పిల్లారాయవీధి, ఎస్‌బీ వీధి ప్రాంతాల మీదుగా కార్యక్రమం కొనసాగింది. ఎస్పీ రాజశేఖరన్, సీబీఐ, ఏసీబీ అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు తాళ్లరేవులో రక్తదాన శిబిరం

తాళ్లరేవు: జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక పరదేశమ్మ వీధిలోని సామ్యూల్ సాగర్ స్వగృహం వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నారు. రక్తదానం చేసిన వారికి ఏడాది పాటు రూ.లక్ష ప్రమాద బీమా చేయనున్నట్లు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించేందుకు గానూ ఏటా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సామ్యూల్ సాగర్ చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక


రేవతి దివ్యభాను

ఉప్పలగుప్తం: నెల్లూరులో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు గొల్లవిల్లి ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారిణి నూకల రేవతి దివ్యభాను ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లంక రాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన అండర్-17 విభాగంలో ఎస్‌జీటీ హాకీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రేవతిని హెచ్‌ఎం రాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వాలా సత్యనారాయణ, పీడీలు గొలకోటి ఫణి, సరస్వతి, విజయభాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అభయాంజనేయుని ఆలయ వార్షికోత్సవం

అమలాపురం రూరల్: మండలంలో ఏ.వేమవరం గ్రామంలో వేంచేసి యున్న అభయాంజనేయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పలు రకాల పూలతో స్వామి వారిని అలంకరించారు. వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అఖండ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మెట్ల రమణబాబు, లింగోలు పండు, కల్వకొలను తాతాజీ, ఏడిద శ్రీను, కే.నాగ మానస, నల్లా పవన్ కుమార్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పూజలు

యానాం: యానాం గౌతమీ గోదావరి తీరంలో కొలువైన శ్రీదత్త మణికంఠ పూజా మందిరంలో శనివారం అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రంగాల రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలాధారణ చేసిన స్వాములు కార్యక్రమానికి హాజరయ్యారు.

అనారోగ్య బాధితుడికి చేయూత

ఐ.పోలవరం: మండల పరిధిలోని మురమళ్ల చెయ్యేటివారి పేటలో అనారోగ్యంతో బాధపడుతున్న సంఘ సభ్యుడికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ సొసైటీ సాయం అందించింది. శనివారం జరిగిన సొసైటీ సమావేశంలో సంఘ సభ్యుడు చెయ్యేటి రాముడికి రూ.2 వేల నగదు, ఒక బియ్యం బస్తాను సొసైటీ సభ్యులు అందజేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామంలో అనధికారికంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న దేగల అంజిబాబును ఎక్సైజ్ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 180 ఎంఎల్ పరిమాణంలో గల 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్సై బాలాజీ సిబ్బందితో వెళ్లి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు.